
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
సోమవారం 20 మే 2024





ధర్మానకు టెన్షన్!

- గత ఎన్నికల్లో మెజార్టీ 5,777 మాత్రమే..
- మంత్రి పదవి చేపట్టినా.. నియోజకవర్గ అభివృద్ధి శూన్యం
- శ్రీకాకుళం అర్బన్, గ్రామీణమంతా వైసీపీకి వ్యతిరేకమే
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కూడా తుస్..?
- ఈసారి ఓటమి ఖాయమంటున్న విశ్లేషకులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల్లో కీలకఘట్టమైన పోలింగ్ ముగిసింది. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ అభ్యర్థుల్లో టెన్షన్ సాధారణమే. కానీ గత ఎన్నికల్లో బొటాబొటీ మెజార్టీతో గెలిచిన వైసీపీ అభ్యర్థుల్లో మాత్రం మరింత టెన్షన్ కనిపిస్తోంది. ఇందులో ప్రస్తుత శ్రీకాకుళం వైసీపీ అభ్యర్థి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముందువరుసలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ విజయం కన్నా.. మంత్రి ధర్మాన ఫలానా ఓట్ల తేడాతో ఓటమి పాలవుతున్నారన్న చర్చే ఎక్కువ జరుగుతోంది. 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారంటే అందులో జగన్‌కు ప్రజలు ఇచ్చిన 'ఒక్కచాన్స్' మాత్రమే. కానీ శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లోనూ.. ధర్మాన ప్రసాదరావుకు ఆచితూచి ఓటేశారు. అప్పుడున్న పరిస్థితుల కారణంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 90 శాతం వైసీపీకే లభించాయి. వాటితో కలిపి లభించిన మెజార్టీ కేవలం 5,777ఓట్లు మాత్రమే. మొత్తం 69.19 శాతం ఓట్లు పోలవ్వగా.. ఇందులో వైసీపీ అభ్యర్థి ధర్మానకు 47.43 శాతం, టీడీపీ అభ్యర్థి గుండ లక్ష్మీదేవికి 44.17 శాతం ఓట్లు లభించాయి. కేవలం 3.26 శాతం ఓట్లతో ధర్మాన విజయం సాధించారు. ఇక జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీచేసి.. 8,897ఓట్లను సాధించాయి. ఇప్పుడు ఈ రెండు పార్టీలు టీడీపీతో కలిసి కూటమిగా ఉన్నాయి. దీంతో ఓటు బ్యాంకు మరింత పెరిగింది. మరో వైపు ఈ ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత ఎక్కువైంది. ఏ అభివృద్ధి చేపట్టకపోవడంతో శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండల ప్రజలు మండిపడుతున్నారు. ధర్మాన ప్రసాదరావు.. మంత్రి పదవి చేపట్టినా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించలేదని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు రహదారిని బాగుచేయించలేక పోయారని, కేఆర్ స్టేడియాన్ని, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పూర్తిచేయించలేక పోయారని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లు కూడా ఎక్కడ చూసినా అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే మొన్న ఎన్నికల్లో ఓట్ల రూపంలో వైసీపీకి బుద్ధి చెప్పారని.. తమకు అనుకూలంగా ఓటేశారని.. కూటమి నాయకులు ధీమాతో ఉన్నారు. ఇదిలా ఉండగా.. పోల్‌మేనేజ్‌మెంట్‌లో కూడా వైసీపీ కిందిస్థాయి నాయకులు.. వార్డులు, గ్రామాల్లో ఓటర్లకు సక్రమంగా డబ్బులు పంచకుండా.. సొంత లాభం చూసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ఓటు బ్యాంకు మరింత తగ్గిందనే ప్రచారం సాగుతోంది.

2019లో పార్టీల వారీగా అభ్యర్థులకు లభించిన ఓట్లు..

అభ్యర్థి	పార్టీ	లభించిన ఓట్లు
ధర్మాన ప్రసాదరావు	వైసీపీ	84,084 (47.43%)
గుండ లక్ష్మీదేవి	టీడీపీ	78,307 (44.17%)
కోరాడ సర్వేశ్వరరావు	జనసేన	7,557 (4.26%)
నోటా	నోటా	3,082 (1.74%)
చౌదరి సతీష్	కాంగ్రెస్	1,827 (1.03%)
చల్లా వెంకటేశ్వరరావు	బీజేపీ	1,340 (0.76%)
మైలపిల్లి తేజు	ఇండిపెండెంట్	533 (0.33%)
రాగోలు నాగశివ	జేజేపీ	305 (0.17%)
ఏ.మహేష్	పీపీఓఐ	262 (0.15%)
	మొత్తం	1,77,297(69.19%)

● సీన్ రివర్స్..

ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్‌బ్యాలెట్ ద్వారా 2019 ఎన్నికల్లో వైసీపీకి గంపగుత్తగా ఓట్లు వేశారు. కాగా.. ఈ ఐదేళ్లలో సీన్ మారింది. ఉద్యోగులు సైతం వైసీపీ ప్రభుత్వ తీరుతో ఇబ్బందులు పడ్డారు. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పిన జగన్.. గద్దెనెక్కి ఐదేళ్లయినా ఆ హామీ నెరవేర్చలేదు. హామీల అమలుకోసం పోరాడిన ఉద్యోగులపై వైసీపీ ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ముందస్తు అరెస్టులతో కట్టడి చేసింది. దీంతో ప్రభుత్వ విధానాలపై ఉద్యోగులంతా ఆగ్రహంతో ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో అధికశాతం మంది ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఓటేశారని విశ్లేషకులు చెబుతున్నారు. శ్రీకాకుళం టీడీపీ అభ్యర్థి గొండు శంకర్.. ధర్మానకు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొంటున్నారు. టీడీపీ విజయం ఖాయమని, సుమారు 20వేల మెజార్టీ లభిస్తుందని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతల్లో మాత్రం నైరాశ్యం కనిపిస్తోంది.



వేంకటేశ్వరునికి కిరణ స్పర్శ

ఎచ్చెర్లలో కొండపై ఉన్న శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామి మూలవిరాట్‌ను ఆదివారం ఉదయం 5.15 గంటలకు సూర్య కిరణాలు తాకాయి. వైశాఖమాసంలో ఏటా ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని.. ఆలయ ధర్మకర్త డాక్టర్ గుంప శివప్రసాద్, అర్చకులు దూబ వైకుంఠరావు(భవాని) తెలిపారు. దశమి నుంచి త్రయోదశి వరకు వరుసగా నాలుగు రోజులపాటు సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్‌ను తాకుతాయని వెల్లడించారు.

- ఎచ్చెర్ల

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 19: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ కొనసాగుతోంది. శ్రీ శివానీ కళాశాలలో(చిలకపాలెం) 230 మంది విద్యార్థులకు 224మంది, శ్రీ వెంకటేశ్వర కళాశాలలో(ఎచ్చెర్ల)177 మందికి 171మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే కోర్ టెక్నాలజీస్(నరసన్నపేట), ఐతం (టెక్కలి)లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులతో జూమ్ కాల్‌లో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

మనోధైర్యంతో ఉండండి

- కిర్గిస్థాన్ విద్యార్థులకు.. ఎంపీ రామ్మోహన్‌నాయుడు సూచన

అరసవల్లి, మే 19: 'మీరంతా భయాందోళన చెందకండి. మనోధైర్యంతో ఉండండి' అంటూ ఎంపీ రామ్మోహన్‌నాయుడు.. కిర్గిస్థాన్‌లో వైద్య విద్యార్థులకు సూచించారు. కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లోని అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని.. మూకహింస అల్లర్లకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు కూడా అక్కడ ఉండడంతో.. వారికి భద్రత కల్పించాలంటూ ఇప్పటికే ఎంపీ రామ్మోహన్‌నాయుడు విదేశాంగ శాఖమంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ప్రత్యేక లేఖ రాశారు. ఆదివారం ఎంపీ రామ్మోహన్‌నాయుడుతో పాటు విశాఖపట్నం టీడీపీ పార్లమెంటరీ ఇన్‌చార్జి భరత్, తెలుగు యువత జనరల్ సెక్రటరీ కిలారు నాగశ్రావణ్ ఆధ్వర్యంలో బిష్కెక్‌లోని విద్యార్థులతో జూమ్ కాల్‌లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, భారతదేశ ఎంబసీకి ఎప్పటికప్పుడు క్షేమ సమాచారం తెలియజేస్తుండాలని ఎంపీ కోరారు. విదేశాంగ శాఖ ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

స్థలాల పేరిట బురిడీ

- రూ.10 లక్షలు కాజేసిన దుండగులు

జలుమూరు (సారవకోట), మే 19: స్థలాల కొనుగోలు పేరిట దుండగులు.. ఓ కాంట్రాక్టర్‌ను బురిడీ కొట్టించారు. రూ.10లక్షల మేర నగదు కాజేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా మామిడిపల్లికి చెందిన కాంట్రాక్టర్ ఎన్.మణికంఠకు.. శ్రీకాకుళం నగరానికి చెందిన శ్రీధర్‌తో పరిచయం ఉంది. సారవకోట మండలం ధర్మలక్ష్మీపురం వద్ద మంచి స్థలాలు(ప్లాట్లు) ఉన్నాయని, వాటిని చౌకగా ఇప్పిస్తామని శ్రీధర్.. కాంట్రాక్టర్ మణికంఠను నమ్మించాడు. అడ్వాన్స్‌గా రూ.10లక్షలు తీసుకురావాలని సూచించాడు. ఈ మేరకు శనివారం మణికంఠ కారులో రూ.10లక్షలు తీసుకురాగా.. ధర్మలక్ష్మీపురం వద్ద శ్రీధర్‌తో కలిసి స్థలాల కోసం మాట్లాడుతున్నారు. ఇంతలో ఒక కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి.. తాము పోలీసులమని.. ఇక్కడ మీరేమి చేస్తున్నారని వారిని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ కారు తనిఖీ చేయగా రూ.10లక్షలు లభ్యమైంది. ఎన్నికల సమయంలో ఇంత నగదుతో ఏమి చేస్తున్నారని దబాయిస్తూ.. మీరు శ్రీకాకుళం డీఎస్పీ కార్యాలయానికి రండి అని చెప్పి నగదుతో పాటు శ్రీధర్‌ను కారులో తీసుకుపోయారు. కాంట్రాక్టరు శ్రీకాకుళం వెళ్లి శ్రీధర్‌కు ఫోను చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి.. సారవకోట పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఈ కేసుపై పాతపట్నం సీఐ దర్యాప్తు చేస్తున్నారని వెల్లడించారు.

అటకెక్కిన ఉద్దానం ప్రాజెక్టు

- 290 గ్రామాలకు అందని తాగునీరు
- ఎక్కడికక్కడ పైపులైను లీకేజీలు
- 20 నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు

(హరిపురం/సోంపేట)

వేసవి వేళ.. జిల్లాలో పలు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎంతో మంది ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దానం ప్రాజెక్టు పరిస్థితి వైసీపీ పాలనలో దయనీయంగా మారింది. ఎక్కడికక్కడ పైపులైన్లు లీకేజీ కాగా.. నీరు వృథాగా పోతోంది. ఈ ఐదేళ్లలో కనీసస్థాయిలో మరమ్మతులు లేవు. ఫలితంగా 8 మండలాల్లో 290 గ్రామాలకు రక్షితనీరు కరువవుతోంది. మరోవైపు 20 నెలలుగా సిబ్బందికి వేతనాలు కూడా అందకపోవడంతో.. ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.

● మందస, సోంపేట, కంచిలి, కవిటి, పలాస, నందిగాం, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో ప్రజలకు తాగునీరందించేందుకు 25 ఏళ్ల కిందట దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కృషితో ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో.. ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ప్రాజెక్టు పరిధిలో చాలాచోట్ల ట్యాంకులకు నీరు సరఫరా అయ్యే ఎయిర్‌వాల్వ్‌లు, గ్రామాల్లోని పైపులైన్లు లీకవుతున్నాయి. నీరు వృథాగా పోతోంది. కొంతమంది రైతులు ఈ వృథా నీటిని జీడితోటలకు, పొలాలకు మళ్లించి వినియోగిస్తున్నారు. దీంతో శివారు గ్రామాలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. కుళాయిల ద్వారా ఎప్పుడు నీరు వస్తుందో తెలియని దుస్థితి నెలకొంది. మత్స్యకార గ్రామాలతోపాటు, బారువ, సోంపేట, వజ్రపుకొత్తూరు లాంటి మేజర్ పంచాయితీల ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి.. నీటి వృథాను అరికట్టేలా అధికారులు చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా నీటిని సక్రమంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



సరియాపల్లిలో ఉద్దానం నీటికోసం బిందెల క్యూ

సిబ్బందికి పస్తులే

ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పరిధిలో 150మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి 20నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో.. కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. పస్తులుండక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ పరిస్థితి దారుణంగా తయారైందని వాపోతున్నారు. గతంలో 16 నెలలు వేతనాలు అందజేయకపోవడంతో సమ్మె చేయగా.. 8 నెలలు జీతాలు అందించారు. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి నెలకొందని.. వేతనాలు సక్రమంగా చెల్లించకపోతే తామెలా బతుకుతామని సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి వేతనాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.



వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న సిబ్బంది



సుదూర ప్రాంతం నుంచి నీటిని తెస్తున్న శ్రీరాంనగర్ ప్రాంత మహిళలు



ఓటీఎస్‌పై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు (ఫైల్)

కొందరికే 'ఓటీఎస్'!

- పట్టాల కోసం లబ్ధిదారుల ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు

(ఇచ్ఛాపురం)

జిల్లాలో చాలామంది గృహ నిర్మాణదారులు ఓటీఎస్ పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. వేలాది మంది లబ్ధిదారుల నుంచి ఓటీఎస్(వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం) కింద అధికారులు డబ్బులు కట్టించుకున్నారు. కానీ కొంతమందికే రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు పంచారు. మిగిలిన లబ్ధిదారులకు ఇంతవరకు పట్టాలివ్వకపోవటంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఓటీఎస్ విధానం ప్రవేశపెట్టింది. ఇళ్లకు రిజిస్ట్రేషన్ పేరిట వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూరల్‌లో రూ.10 వేలు, అర్బన్‌లో రూ.15వేలు చొప్పున వసూలు చేసింది. ఈ డబ్బులు చెల్లించేందుకు కొంతమంది లబ్ధిదారులు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించి.. ఓటీఎస్ డబ్బుల వసూళ్లపై లక్ష్యాలు విధించింది. జిల్లా, మండలస్థాయి అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఒత్తిడి మేరకు జిల్లాలో మొత్తం 2,57,950 మంది ఓటీఎస్ కింద డబ్బులు చెల్లించారు. అధికారులు 2,11,282 మందికి రిజిస్ట్రేషన్లు చేశారు. ఇంకా 46,668 మంది రిజిస్ట్రేషన్ల పట్టాల కోసం ఎదురుచూస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను, మాజీ వలంటీర్లను అడిగినా ముఖం చాటేస్తున్నారే తప్ప.. స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. తాము చెల్లించిన డబ్బులైనా తిరిగిచ్చేయాలని కోరుతున్నారు. దీనిపై జిల్లా కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. చాలామందికి ఓటీఎస్ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశామని తెలిపారు. సాంకేతిక కారణాలతో కొన్ని రిజిస్ట్రేషన్ కాలేదన్నారు. డబ్బులు చెల్లించిన వారందరికీ రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి సచివాలయాల ద్వారా పత్రాలు పంపిణీ చేస్తామన్నారు.





నమో.. వేంకటేశా..

నరసన్నపేట వేంకటేశ్వరుని దేవస్థానంలో.. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఆదివారం సుప్రభాతం సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విష్వక్సేనుని పూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాస ఉత్సవ మూర్తులను హంస వాహనంపై పట్టణ వీధుల్లో తిరువీధిగా అంగరంగ వైభవంగా ఊరేగించారు. వేలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కోలాటం, తప్పెటగుళ్లు, కూచిపూడి తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, మావుడూరి జగదీష్ ఆధ్వర్యంలో సత్యవర అగ్రహారం రుత్వికుల సమక్షంలో ఉత్సవాలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

- నరసన్నపేట

ఆదిత్యా.. పట్టించుకునేదెవరు?

- అరసవల్లిలో భక్తులకు తప్పని ఇక్కట్లు
- కానరాని సౌకర్యాలు
- బురదనీటిలోనే పుణ్యస్నానాలు
- ట్రాఫిక్ రద్దీతో అవస్థలు

అరసవల్లి, మే 19: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. అరసవల్లిలోని ఆదిత్యుడి ఆలయంలో భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. వైశాఖమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు ఆదిత్యుడి దర్శనానికి పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజే సూర్యనారాయణస్వామికి రూ.19,31,975 ఆదాయం లభించింది. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.13,04,100, విరాళాల ద్వారా రూ.1,21,675, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.3,27,720, కేశఖండన ద్వారా రూ.1,78,480 లభించినట్టు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. కాగా.. ఇంత ఆదాయం వస్తున్నా.. భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అభివృద్ధి పేరుతో ఇంద్రపుష్కరిణిలో నీటిని ఎండగట్టిన అధికారులు.. పవిత్ర స్నానాలకు సంబంధించి చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహించారని భక్తులు ఆరోపిస్తున్నారు. బురదనీటిలోనే స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. 'ఆలయ పరిసర ప్రాంతాలతోపాటు.. సింహద్వారం వెలుపలా ట్రాఫిక్ రద్దీని పట్టించుకునేవారు లేరు. ఓ వైపు ఎండలు మండుతుండగా.. గంటల తరబడి క్యూలో ఉన్నా.. కనీసం మంచినీళ్ల ప్యాకెట్లు కూడా పంపిణీ చేయలేదు. రద్దీ నేపథ్యంలో క్యూలో తోపులాట జరిగినా పట్టించుకున్న నాథులు లేర'ని వాపోయారు.



ఆదిత్యాలయంలో క్యూలో బారులుదీరిన భక్తులు



ఇంద్రపుష్కరిణి వద్ద బురదనీటిలోనే భక్తుల స్నానాలు

● అనధికార వ్యక్తులదే హవా

ఆదిత్యుడి ఆలయంలో అనధికార వ్యక్తుల హవా సాగుతోంది. ఆదిత్యుడి ప్రత్యేక దర్శనం కావాలంటే ఆలయంలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులను సంప్రదించాల్సిందే. ప్రత్యేక దర్శనాల పేరుతో గతంలో హోంగార్డులు, ఆలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం కూడా పలువురు చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు ఉన్నాయి. మంగువారితోటకు చెందిన ఓ వ్యక్తి సమాచార కేంద్రం వద్ద సేవ పేరుతో భక్తులను అధిక సంఖ్యలో దర్శనాలకు పంపించారు. దీనిపై క్యూలో ఉన్న భక్తులు నిలదీయడంతో ఆలయం ఎదుట గందరగోళం నెలకొంది. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి ప్రైవేటు వ్యక్తుల జోక్యాన్ని నివారించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు వద్ద ప్రస్తావించగా.. ఈవో దృష్టికి సమస్యను తీసుకెళ్లి అనధికార వ్యక్తుల హవాపై చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు.



దిక్సూచి
DIKSUCHI

ఇండియా శ్రామిక మార్కెట్

ఇండియన్ ఎకానమీ

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జి.20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు. ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్



ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామికరంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్నవారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తుల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామిక రంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు(సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఎ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-4

కోడింగ్ - డీకోడింగ్

రీజనింగ్



ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద ఆంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:
1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR

2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT

3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB

4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK

5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. సమాధానం: (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.

2. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

3. సమాధానం: (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.

4. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

5. సమాధానం: (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. **ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏమిటి?**
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.

4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handగాను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికే ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

నక్సలైట్ టెస్ట్ పేరుతో ఆటవికం

మహిళలను తాకరాని చోట తాకుతూ బలగాల అరాచకం



రఘు మిడియామి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆధార్ లేకుంటే ఆదివాసీ మహిళలకు హింసే
- మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ
- రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు
- అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం
- 'ఆంధ్రజ్యోతి'తో.. ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళలను తాకరాని చోట తాకడం.. ఈ పరీక్షలో మహిళ వక్షోజాల నుంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సిలేంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలేంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలేంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత కర్కశంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలా మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్ట్‌లు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్ల ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. మిగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లోని బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. పూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'



విజయవాడ పటమట ప్రాంతంలో మబ్బులు కమ్మేసిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. పిడుగులు.. నేడూ కొనసాగే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పెదకూరపాడులో 55.5, వత్సవాయిలో 40, జగ్గయ్యపేటలో 39.5, అడ్డతీగలలో 38, చింతలపల్లిలో 36, అనపర్తిలో 35.2, రావికమతంలో 35.7, రాజవొమ్మంగిలో 35, బిక్కవోలులో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం మన్యం, అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరు జిల్లాల్లోని 24 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

- రైల్వే, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం
- లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు
- రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు
- సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్‌నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీనగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్ల ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి 'నియామకపత్రాన్ని' కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాలవ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూడగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయ పన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్, రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్టు సమాచారం.

సాంకేతిక విద్యకు చిరునామా ట్రిపుల్ ఐటీ

- ప్రవేశాలకు ప్రకటన విడుదల
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేదీ జూన్ 25
- నాలుగు క్యాంపస్‌లకు ఒకటే దరఖాస్తు

(హిరమండలం)

గ్రామీణ ప్రాంత విద్యార్థులు అత్యున్నత సాంకేతిక విద్యను పొందేందుకు గాను రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్‌జేయూకేటీ) ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. వీటిలో 2024-25 సంవత్సరంలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను ఈనెల 6న విడుదల చేసింది. ఆరేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను జూన్ 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపికైన విద్యార్థుల జాబితాను జూలై 11న ప్రకటిస్తారు. సర్టిఫికేట్ల పరిశీలన ప్రక్రియ నూజివీడు, ఇడుపులపాయ క్యాంపస్‌లలో జూలై 22, 23 తేదీల్లోను, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి ఇడుపులపాయలో 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు 26, 27 తేదీల్లో ఉంటుంది. ఆగస్టులో ప్రవేశాలు నిర్వహించి అదే నెలలో తరగతులను ప్రారంభిస్తారు. ట్రిపుల్ ఐటీల్లో చేరేందుకు సర్టిఫికేట్లు, ఫీజుల వివరాలిలా ఉంటాయి.

ఫీజు వివరాలు

సామాజిక వర్గాల విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సరాదాయం రూ.లక్ష లోపు ఉంటే బోధన రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం రూ.3 వేల కాషన్ డిపాజిట్ చెల్లించాలి. ఇది కోర్సు పూర్తయ్యాక తిరిగి ఇచ్చేస్తారు. ఎస్సీ, ఎస్టీలు రూ.2500 చెల్లించాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష దాటిన వారు రూ.36 వేల బోధన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.

- ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లో పనిచేసే వారి పిల్లలు రూ.1,36,000 ఫీజు చెల్లించాలి.
- అంతర్జాతీయ, ఎన్ఆర్ఐ విద్యార్థులు సంవత్సరానికి రూ.3 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఎవరు అర్హులు.. దరఖాస్తు ఎలా?

ఈ విద్యా సంవత్సరంలో తొలి ప్రయత్నం లోనే పదో తరగతిలో ఉత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులు అర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి 18 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 21 సంవత్సరాల వయసు దాటకూడదు. పదో తరగతిలో గ్రేడ్ పాయింట్ల ఆధారంగా ప్రవేశాలుంటాయి.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

- ట్రిపుల్ ఐటీలో చేరాలనుకునే విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్ ద్వారా ఆర్జీయూకేటీ వెబ్ సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తు రుసుం ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.200గా నిర్ణయించారు.
- దరఖాస్తు రుసుంను ఏపీ ఆన్‌లైన్‌కు నగదు రూపంలో చెల్లించి, రసీదు పొందడమే కాక ఏపీ ఆన్‌లైన్ సేవలకు రూ.25 చెల్లించాలి.
- నాలుగు ట్రిపుల్ ఐటీలకు ప్రాధాన్యతలను చూపుతే ఒకే దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక విభాగాల్లో ఎంపికైన అభ్యర్థులు తమ రిజర్వేషన్లను ప్రింటవుట్లు, ధ్రువీకరణ పత్రాలు, సంతకంతో పంపాలి.
- గతంలో ఒక్కో ట్రిపుల్ ఐటీకి ఒక్కో దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఒకే దరఖాస్తు సరిపోతుంది. అందులో ప్రాధాన్యత వెల్లడిస్తే చాలు. మొదటి, రెండు, మూడు, నాలుగు ప్రాధాన్యతలను దరఖాస్తులో చూపాలి.
- పదో తరగతి తత్సమాన పరీక్ష హాల్ టికెట్, పదో తరగతిలో సాధించిన జీపీఏ వివరాలను సమర్పించాలి.
- ట్రిపుల్ ఐటీలో ఎంపికైన విద్యార్థుల జాబితాను విశ్వవిద్యాలయ అధికారి వెబ్ సైట్‌లో ఉంచుతారు. విద్యార్థులకు ఈ-మెయిల్, మొబైల్, పోస్టల్ ద్వారా సమాచారం పంపుతారు.

ఎవరెవరు ఎక్కడ లోకల్ అంటే...

- నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో గుంటూరు, ప్రకాశం, కృష్ణా, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల విద్యార్థులను లోకల్‌గా పరిగణిస్తారు. మిగిలిన జిల్లాల విద్యార్థులను నాన్ లోకల్‌గా గుర్తిస్తారు.
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ పరిధిలో చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు, నెల్లూరు జిల్లాల విద్యార్థులు లోకల్‌గా గుర్తింపబడతారు. మిగిలిన వారు నాన్ లోకల్.

ప్రవేశం తరువాత...

ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆరేళ్ల కోర్సు ఉంటుంది. ఇందులో మొదటి రెండేళ్లు పీయూసీ, మిగిలిన నాలుగేళ్లు ఇంజనీరింగ్ విద్యను చెబుతారు. ట్రిపుల్ ఐటీల ప్రధాన లక్ష్యం ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు మొత్తం కోర్సు అక్కడే పూర్తి చేసేందుకు ఇష్టపడుతుంటారు.



మార్కులు సమానంగా ఉంటే..

- గ్రేడ్ పాయింట్ల ఆధారంగా ఎంపిక చేస్తారు. కాబట్టి ఒకే రకమైన పాయింట్లు వచ్చిన వారు వేలల్లో ఉంటారు. అలాంటప్పుడు మరికొన్ని అంశాలకు ప్రాధాన్యమిస్తారు.
- గణితంలో ఎక్కువ మార్కులున్న వారికి మొదటి ప్రాధాన్యం.
- అక్కడ కూడా సమానంగా ఉంటే భౌతికశాస్త్రం, అప్పుడూ సమానమైతే రసాయన శాస్త్రం చివరగా ఆంగ్లం మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- అప్పటికీ ఎక్కువ మంది సమానంగా ఉంటే పుట్టిన తేదీ ఆధారంగా ఎక్కువ వయసున్న వారికి ప్రవేశం కల్పిస్తారు.
- ప్రభుత్వం నిర్దేశించిన ప్రభుత్వ పాఠశాలలు, జడ్పీ, మునిసిపల్ పాఠశాలల విద్యార్థులకు 0.4 జీపీఏ అదనంగా కలుపుతారు.

ఎంపిక ఎలా ఉంటుందంటే..

పదో తరగతిలో సాధించిన గ్రేడ్ పాయింట్ (జీపీఏ) ఆధారంగా ఎంపిక జరుగుతుంది. నూజివీడు, ఒంగోలు, ఇడుపులపాయ, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఒక్కో దానిలో 1000 మంది చొప్పున మొత్తం 4000 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. వీటిలో 85 శాతం ఆయా విశ్వవిద్యా లయాల పరిధిలోని జిల్లాల విద్యార్థులకు కేటాయిస్తారు. 15 శాతం ప్రతిభ ఆధారంగా ఓపెన్ కేటగిరిలో ఏపీ, తెలంగాణ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారు. సీట్లను రిజర్వేషన్ల వారీగా అమలు చేస్తారు. దివ్యాంగ విద్యార్థులు స్టేట్ మెడికల్ బోర్డు ధ్రువీకరణ పత్రాలు, సైనికుల పిల్లలు, క్రీడా కోటాలో చేరే వారు జిల్లా బోర్డు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

దరఖాస్తుతో పాటు జతచేయాల్సిన సర్టిఫికేట్లు..

- క్రాసెడ్ డిమాండ్ డ్రాఫ్ట్ (ఓసీ, బీసీలకు రూ.300, ఎస్సీ, ఎస్టీలకు రూ.200) ఆర్జీయూకేటీ ఎస్‌బీహెచ్ నంబర్లు లేదా స్టేట్ బ్యాంక్ కలెక్ట్ ఇ-రిసీప్ట్ రసీదు.
- నాలుగు నుంచి పదోతరగతి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్
- పదో తరగతి హాల్ టికెట్ నంబరు.
- నివాస ధ్రువీకరణ పత్రం.
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కులధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.
- ప్రత్యేక విభాగాలకు చెందిన వారు సంబంధిత ధ్రువపత్రాలు జతచేయాలి. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన దరఖాస్తు, సర్టిఫికేట్ల ప్రింట్లను యూనివర్సిటీకి పంపాల్సి ఉంటుంది.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

నందిగాంలో వేంకటేశ్వరుని కల్యాణం

నందిగాం: జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అమ్మవార్ల సంబరాలతో పాటు వెంకన్న స్వామి, నరసింహ స్వాముల కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నందిగాం మండలం పెంటూరులో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం 22వ వార్షికోత్సవం సందర్భంగా వార్షిక కల్యాణం ఆదివారం కమనీయంగా నిర్వహించారు. ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో శ్రీకూర్మంకు చెందిన వేదపండితులు గోపినంబాళ్ల వెంకటదాస్ కూర్మాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకుడు డి.రవిరామాచార్యులు, ఇతర రుత్వికుల వేదమంత్రాల మధ్య నవకలశ స్నపనం, పంచామృతాభిషేకం, విశేష హోమాలు, పూర్ణాహుతి, కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నందిగాం, పెంటూరు తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.




ఎల్ఎన్‌పేట: కలశాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న మహిళలు, గ్రామస్థులు



నందిగాం: వెంకన్న స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం



టెక్కలి: టెక్కలి కొండ్రవీధి జంక్షన్‌లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక కల్యాణం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ అర్చకుడు సీహెచ్ రమణాచార్యులు కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో వాకచర్ల రాధాకృష్ణ, పలువురు భక్తులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) సత్యనారాయణ స్వామి

పలాస: స్థానిక సీతారామాలయంలోని అన్నవరం సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు ఆది వారం కన్నుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున మేలుకొలుపుతో కార్యక్రమాలు ప్రారంభించిన అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకం చేపట్టారు. అనంతరం నగర పురోహితులు నగరంపల్లి ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో దంపతులతో సత్యవ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో మందిర ప్రధాన కార్యదర్శి గిన్ని జయ శంకర్‌రెడ్డి, ధర్మకర్త పెంట భాస్కరరావు, కృష్ణానందస్వామితో పాటు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు చల్లదనం

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో బంగారు సంతోషిమాత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు భారీ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించి చల్లదనం చేశారు. మంగళవాయిద్యాలు, నృత్య ప్రదర్శనల మధ్య మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ ఎం.దివాకర్ నాయుడు, పెద్దలు వి.పాండురంగనాథరాజు, ఎం.జనార్దనరావు, రామ్‌నాథ్ మహాపాత్రో తదితరులు తెలిపారు.

లింగాలవలసలో..

జలుమూరు: లింగాలవలస గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ముర్రాటలు సమర్పించి చల్ల దనం చేశారు. ఏడాది పొడవునా చల్లగా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు. మహిళలు కలశాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొని తరించారు. అల్లాడ గ్రామంలో నిర్వహిస్తున్న రాజరాజేశ్వరి అమ్మవారి సంబరాల్లో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సనపల రమణ, టీడీపీ నాయకులు దుద్దు రాజేశ్వరరావు, హనుమంతు రంగనాథం తదితరులు పాల్గొన్నారు.



లింగాలవలసలో పోలేరమ్మ తల్లికి పూజలు చేస్తున్న మహిళలు

గుల్లవానిపేటలో..

గుల్లవానిపేట(పోలాకి): సాగరతీర ప్రాంతం గుల్లవానిపేటలో రెండు రోజులుగా గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. పది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి చల్లదనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

జలుమూరు: సుప్రసిద్ధ శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వర స్వామికి ఆదివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి నిర్వహించారు మహిళలు, భక్తులు మంగళ హారతులిచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి ఉత్సవం

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం చేపట్టారు. కార్యక్రమంలో ఈవో ఎస్.చంద్రశేఖర్, అర్చకుడు ఇప్పిలి రంజిత్ శర్మ, పండితులు దర్భముళ్ల శ్రీనివాసశర్మ, కె.శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యునికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఎండల మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం

ఆమదాలవలస: పట్టణంలోని జగ్గుశాస్త్రులపేటలో వెలిసిన ఎండల మల్లికార్జునస్వామి ఆలయ 71వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు మీగడ కృష్ణారావు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుంపల చిరంజీవి, అర్చకులు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిపై బగ్గు సమీక్ష



నేతలతో సమీక్షిస్తున్న బగ్గు రమణమూర్తి

మబగాం (పోలాకి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో క్షేత్రస్థాయిలో జరిగిన ఓటింగ్ సరళిపై ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణ మూర్తి ఆదివారం మబుగాం లోని నివాసం లో టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. డోల జగన్, చిన్నాల కూర్మినాయుడు, మెండ రాంబాబు, శాంతి, తమ్మినాన భూషణరావు తదితరులు ఆయనను కలిసి పోలింగ్ తీరును వివరించారు. కార్యక్రమంలో భైరి భాస్కరరావు, ఎంవీ నాయుడు, చిట్టి సింహాచలం, పల్లి సూరిబాబు, రాంబాబు, కోనేటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా అమలుచేయాలి

హరిపురం: జీడి రైతులకు పెట్టుబడులు పెరిగి దిగుబడులు లేక నష్టాలకు గురవుతున్నారని, ప్రభుత్వం పంటల బీమా అమలు చేసి ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు మామిడి మాధవరావు అన్నారు. హరిపురం మార్పు ట్రస్ట్ భవనంలో ఆదివారం జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. జీడి రైతులకు ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి అవుతుందని, అయితే దిగుబడులు బస్తా పిక్కలు కూడా రావడం లేదన్నారు. బస్తా ధర రూ.16 వేలు ఉండేలా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన, పుచ్చ దుర్యోధన, నల్ల హడ్డీ, బెస్త కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధరపై ఉద్యమం



కాశీబుగ్గ: జీడికి 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసేవరకు ఉద్యమం ఉధృతం చేస్తామని జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్ రావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జీడి రైతు కృష్ణారావు అధ్యక్షతన జీడి గిట్టు బాటు ధరపై జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది పంట కాలంలో వర్షాభావ పరిస్థితులతో పంట నష్టం వాటిల్లిందని, బీమా అమలు చేసి ఆదుకోవాలన్నారు. సమావేశంలో భాస్కరరావు, గురయ్య, రామకృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విద్యతోనే సామాజిక మార్పు

పలాసరూరల్: విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని, దీనికై ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక కృషి చేస్తుందని వైద్యులు టి.బాలక్రిష్ణ, తెప్పల ఆనంద్ అన్నారు. నీలావతి గ్రామంలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి, యువతలో సామాజిక మార్పునకు గ్రంథాలయం ద్వారా విశేషంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన బద్రి కూర్మారావు మాస్టార్, లండ జగన్నాథం, పెద్దింటి శశివర్మ, దుమ్మ శంకరరావు, సాహుకారి వల్లభరావు మాస్టార్లను సత్కరించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందించారు. యూవీవీ ప్రధాన కార్యదర్శి బి.చిన్నారావు, ఓంకార్, కుత్తుమ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ఉత్సవాలు చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు: గ్రామాల్లో అమ్మవార్ల ఉత్సవాలను నిబంధనలకు లోబడి చేసుకోవాలని ఎస్ఐ సీహెచ్ రామారావు అన్నారు. కొత్తపేట గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత ఉత్సవాలపై గ్రామస్థులతో సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ఆర్భాటాలు లేకుండా చూడాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, శ్రీకాకుళం : 9985411535
రాజాం : 9494691912, పలాస : 9985411532

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సంతబొమ్మాళి: సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం పాఠశాలలో జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులు భాస్కరభట్ల శ్రీరామూర్తి, అప్పలరాజు, సూర్యనారాయణలను ఘనంగా సన్మానించారు. తమతో చదువుకొని మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం డా. అంగూరు రామారావుతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉండాలి: ఆర్వో

టెక్కలి: ఎన్నికల అనంతరం కూడా సమస్యాత్మక గ్రామాల్లో నిరంతర నిఘా ఉండాలని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ బాల చంద్రారెడ్డితో కలిసి పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని, అవసరమైతే గ్రామాల వారీగా బైండోవర్లు చేయాలన్నారు. నేరచరిత్ర, చెడు ప్రవర్తన కలిగిన వారిపై దృష్టి సారించాలని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తరాదన్నారు. 144 సెక్షన్ అమ లులో ఉందని, పోలీసులు సమస్యాత్మక గ్రామాల్లో సైరన్ కొడుతూ ఎప్పటికప్పుడు చక్కర్లు కొట్టాలని డీఎస్పీకి సూచించారు. సమావేశంలో ట్రైనీ డీఎస్పీ రాజా, సీఐ పి.షైడయ్య, ఎస్ఐలు వెంకటేశ్వరరావు, కిషోర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోండి

పలాస: ప్రభుత్వ ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే అభ్యర్థులు ఒరిజినల్ పదో తరగతి మార్కుల షీట్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్, మెయిల్ ఐడి, పాస్ ఫోటోపాటు రిజిస్టర్డ్ ఐడీ స్లిప్‌ను తీసుకొని సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో పరిశీలించుకొని సరి చేసుకో వాలని సూచించారు. పలాస ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, కోపా తదితర కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నా మన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

టెక్కలి: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రిలో టీమ్ తారక ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు దాలిశెట్టి భాస్కర్, డాక్టర్ సునీత నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 41 మంది అభిమానులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో వెంకీ, కిరణ్, పవన్, లక్ష్మణ్, బాలకృష్ణ, ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లిని స్ఫూర్తిగా తీసుకోవాలి

టెక్కలి/వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ/కొత్తూరు/మందస: కమ్యూనిస్టు ఉద్యమనేత, స్వాతంత్ర్య సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం టెక్కలి, వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, కొత్తూరు, మందసల్లో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టెక్కలిలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు మాట్లాడుతూ.. పార్లమెంట్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదాలో సైకిల్‌పై వెళ్లి ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. పేదలు, కార్మిక పక్షాన పోరాటాలు చేసి నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి సుందరయ్య అన్నారు. కార్యక్రమాల్లో సీపీఎం, సీఐటీయూ నేతలు కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, బమ్మిడి ఆనందరావు, నెయ్యిల మోహనరావు, గంగరావు సింహాచలం, శిర్ల ప్రసాద్, కె.మోహన్‌రావు, అజయ్‌కుమార్, కృష్ణారావు, ఎన్.గణపతి, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

కొత్త జంట కోరుకునే పెళ్లి కానుక
వివాహ మహోత్సవ శుభాకాంక్షలు
ఆంధ్రజ్యోతి లో
వివాహ ప్రకటన ఇవ్వటం ద్వారా మీ ప్రతిష్ఠను పెంచుకోండి.
నవీన రీతిలో ఆహ్వానించి బంధుమిత్రులను అలరించండి
▸ శుభాకాంక్షలు
▸ ధన్యవాదాలు
▸ వివాహ ఆహ్వానాలు
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం
ప్రకటనలకు సంప్రదించండి
99854 11066

ఎంఎల్ఎస్ పాయింట్ తరలింపునకు రంగం సిద్ధం ?

● పొందూరులో రేషనలైజేషన్ పేరుతో మూసివేతకు అధికారుల సన్నాహాలు ● ఉపాధి కోల్పోనున్న తొమ్మిది మంది కలాసీలు


పొందూరులోని ఎంఎల్ఎస్ పాయింట్

పొందూరు: అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల డీలర్లకు కష్టాలు తప్పేలాలేవు. పొందూరులోని సివిల్ సప్లైసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి నిల్వ గిడ్డంగి (ఎంఎల్ఎస్ పాయింట్)ను రేషనలైజేషన్ పేరుతో ఎత్తివేతకు జిల్లా సివిల్‌సప్లై సంస్థ అధికారులు రంగం సిద్ధంచేశారు. దశాబ్దాలుగా పొందూరులో నడిచిన ఎంఎల్ఎస్ పాయింట్‌నుఅధికారులు గతంలోనే మూసివేతకు ప్రయత్నించారు. అయితే తీవ్ర వ్యతిరేకత రావడంతో అదనపు ఎంఎల్ ఎస్ పాయింట్‌గా మార్చారు. అప్పటి నుంచి జి.సిగడాం ఎంఎల్ఎస్ పాయింట్ ఆధ్వర్యంలో నడుస్తోంది. అయితే ఇటీవలజిల్లా సివిల్‌సప్లై సంస్థ అధికారులు ఈఅదనపు ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఎత్తివేసేందుకు సిద్ధమయ్యారు. ఈఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో మండలంలోని 62 రేషన్‌దుకాణాలు ఉన్నాయి.అయితే ఒక్కసారిగా ఎత్తివేస్తే ప్రజలు,డీలర్ల నుంచి వ్యతిరేకతవస్తుందన్న ఉద్దేశంతో దశలవారీగా ఎత్తివేతకు సిద్ధమయ్యారు. దీంలో భాగంగా మండలంలోని 62 రేషన్ దుకాణాలలో 20దుకాణాలను ఆమదాలవలస ఎంఎల్ఎస్ పాయింట్‌కు, పది దుకాణాలను శ్రీకాకుళం ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోకి తీసుకువెళ్లారు.ఇప్పటికే డీలర్లు ఈఎంఎల్ఎస్ పాయింట్‌లోనే అథంటికేషన్ వేశారు. మిగిలిన 32రేషన్ దుకాణాలను జి.సిగడాం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. సమీపంలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌లో రేషన్‌దుకాణాలను అనుసంధానంచేస్తున్నట్లు చెపుతున్న అధికారులు మండలంలోని మజ్జిలపేట రేషన్ దుకాణాన్ని ఆమదాలవలస ఎంఎల్ఎస్ పాయింట్‌కు అనుసంధానం చేశారు.పొందూరు ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో దశాబ్దాలుగా తొమ్మిదిమంది కలాసీలు,వారి కుటుంబసభ్యులు పనిచేస్తున్నారు.వీరు రేషన్‌సరుకులు లోడింగ్, అన్‌లోడింగ్ ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈ పాయింట్‌ద్వారా వచ్చే కూలీ డబ్బులతోనే కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇప్పుడు ఈ ఎంఎల్ఎస్ పాయింట్‌ను తొలగిస్తే ఇక్కడ పనిచేస్తున్న తొమ్మిది మంది కలాసీల కుటుంబాలు రోడ్డున పడతాయి. కాగా జిల్లా సివిల్ సప్లై అధికారుల నిర్ణయం మేరకే ఇక్కడ నుంచి 20 రేషన్ డీలర్లకు ఆముదాలవలస ఎంఎల్ఎస్ పాయింట్‌కు, 10 రేషన్ దుకాణాలను శ్రీకాకుళం ఎంఎల్ఎస్ పాయింట్‌కు అనుసంధానంచేసినట్లు పొందూరు డీటీ వెంకటేశ్వర రామానుజులు తెలిపారు.

మా కుటుంబాలు రోడ్డున పడతాయి



దశాబ్దాలుగా మా కుటుంబాలు, మేము ఈ ఎంఎల్ ఎస్ పాయింట్‌లో కళాసీలుగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాం. ఈపాయింట్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే 30 రేషన్ దుకాణాలు వేర్వేరు ఎంఎల్ఎస్‌పాయింట్లకు తరలించడంతో పనితగ్గి కూలి తగ్గిపోయింది. మిగిలిన దుకాణాలను జి.సిగడాం తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఇదేజరిగితే మా కుటుంబాలు రోడ్డున పడతాయి.

డొంక గోవింద్ కలాసీ, ఎంఎల్ఎస్ పాయింట్ పొందూరు

నరసన్నపేటలో పార్కింగ్ కోసం పాట్లు

● రోడ్డుపై వాహనాలు నిలిపివేత ● బ్యాంకులు, వాణిజ్య సముదాయాల వద్ద ఇబ్బందులు ● జఠిలంగా మారుతున్న ట్రాఫిక్ సమస్య

నరసన్నపేట: నరసన్నపేటలో వాహనచోదకులకు పార్కింగ్ సమస్య వేధిస్తోంది. పట్టణంలో ప్రధాన వాణిజ్య కూడళ్లల్లో ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌చేసేందుకు స్థలంలేకపోవడంతో వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. మేజర్ పంచాయతీ కావడం, వాణిజ్య ప్రాంతంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి కావడంతోపాటు పలు మండలాలకు కూడలిగా ఉండడంతో నిత్యంవందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల పలుబ్యాంకులు కొత్తగా బ్రాంచ్‌లను ఏర్పాటుచేశాయి. దీనికి తోడు ప్రస్తుతం ప్రజలు ప్రతి కార్యక్రమం కల్యాణమండపాల్లోనే నిర్వహిస్తున్నారు.దీంతో పలువురు పట్టణంలోవిశాలప్రాంగణాల్లో కల్యాణమండపాలు ఏర్పాటుచేసినా పార్కింగ్ సదుపాయం కల్పించలేదు. దీనికితోడు పెద్దపెద్ద సంస్థలు వస్త్ర, నిత్యావసరసరుకుల దుకాణాలు, మెడికల్‌షాపులు, ప్రైవేటు ఆస్పత్రులు ఏర్పాటుచేశారు. వీటి అవసరాలకు వచ్చే వారంతారోడ్డుపైనేపార్కింగ్‌చేస్తున్నారు. రోడ్డులో వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఒక్కోసారి పార్కింగ్ చేస్తున్న వారితో దుకాణాల ఎదుటపార్కింగ్ చేస్తే వ్యాపారులు గొడవకు దిగుతున్నారు. పట్టణ జనాభా 30 వేలు కాగా సమీప గ్రామాల నుంచి వివిధ పనులతో ప్రజలతో పట్టణ వీధులు కిటకిటలాడుతున్నాయి. నరసన్నపేటలో 16 వాణిజ్య బ్యాంకులు, తొమ్మిది ఫంక్షన్ హాళ్లు, పలు వాణిజ్య సముదాయాలు, 100కు పైగా హోటళ్లు, టిఫిన్ దుకాణాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కటి సరైన పార్కింగ్ సదుపాయాలులేవు.నిబంధనల ప్రకారం వాణిజ్య కార్యకలాపాలు జరిగే పరిసరాల్లో భవనాల హద్దు కొలతలతో 30శాతం, బహుళ గృహసముదాయాల్లో 25శాతం పార్కింగ్‌కు ఖాళీ స్థలం కేటాయించాలి. కానీ నిబంధనలు పట్టణంలో ఎక్కడాకానరావు. దీంతో ప్రతిరోజూ పట్టణంలో పార్కింగ్ సమస్యలతోపాటు ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోంది. కాగా రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించి పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తామని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఫుట్‌పాత్‌పై ఆక్రమణల లేకుండా చర్యలు తీసుకుమంటామని చెప్పారు.


నరసన్నపేట కొత్తబస్టాండ్ వద్ద రోడ్డుపైనే ద్విచక్రవాహనాలు పార్కింగ్‌చేసిన దృశ్యం

పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి



వాణిజ్య సముదాయాలు వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి.పట్టణంలో ఎక్కడాపార్కింగ్‌కు స్థలంలేక రోడ్డు పైనేపార్కింగ్ చేయాల్సి వస్తోంది.

- రెడ్డిశ్రీనివాసరావు, జమ్ము

వాహన చోదకుల ఇక్కట్లు గుర్తించాలి



బ్యాంక్‌లు, వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్‌హాళ్లకు నిబంధనలు ప్రకారం పార్కింగ్‌కు స్థలాలు కేటాయించాలి. లేకపోతే తగు చర్యలు చేపట్టాలి. వాహనచోదకుల ఇక్కట్లను గుర్తించాలి

- బోయన బాలకృష్ణ, నరసన్నపేట

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

స్నేహితులతో స్నానానికి వెళ్లి..

●బాదుర్లపేటకు చెందిన వ్యక్తి నాగావళి నదిలో మృతి


రమేష్‌ను ఒడ్డుకు చేరుస్తున్న యువకులు

శ్రీకాకుళం క్రైం:నాగావళి నదిలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులుకథనం మేరకు.. శ్రీకాకుళం నగరంలోని బాదుర్లపేటకు చెందిన ఎండ రమేష్(18) స్నేహితులతో కలిసి ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో కలెక్టర్ బంగ్లా సమీపంలోని నాగావళినదిలో స్నానానికి వెళ్లాడు. ఒక్కసారిగా స్నేహితులతోపాటు లోతట్టు ప్రాంతానికి వెళ్లడంతో రమేష్ నీట మునిగిపోయాడు. గమనించిన అక్కడే ఉన్న స్థానిక యువత రమేష్‌ను కాపాడేందుకు నదిలో వెతుకులాట సాగించారు. సుమారు అరగంట పాటు వెదకగా, నీటి అడుగున రమేష్ దొరికాడు అప్పటికే తల్లిదండ్రులకు స్థానిక యువత సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. ఒడ్డుకు చేర్చిన రమేష్‌కు పీసీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. వెంటనే ద్విచక్ర వాహనంపై రిమ్స్‌కు తరలించారు. అప్పటికే రమేష్ చని పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం అనంతరం తల్లి గోవింద ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్ కేసు నమోదుచేశారు. తండ్రి గురవయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

● చిన్నవెంకటాపురంలో ఇరువర్గాల మధ్య వివాదం

టెక్కలి: కోటబొమ్మాళి మండలంలోని చిన్నవెంకటాపురంలో ఈనెల 16న పాతపట్నం అమ్మ వారి ఆలయం వద్ద ఇరు వర్గాల మధ్య జరిగిన చిన్న వివాదంలో ఓ వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలో ఈనెల 16న సాయంత్రం 5 గంటల సమయంలో అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు గ్రామస్థులు గుడి వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో 60 ఏళ్ల తోట మల్లేసు కోడిపుంజు పట్టుకొని మొక్కు చెల్లించేందుకు ముందుకువచ్చాడు. ఇంతలో అదే గ్రామానికి చెందిన పూతి లక్ష్మణరావు, దానమ్మ, భాను చందర్, కర్రెన్న, రమణ ప్రతి ఏటా మాకుటుంబమే ముందుగా అమ్మవారికి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ కదా ఇప్పుడు నువ్వేంటి అందరి కంటే ముందుగా మొక్కులిచ్చేందుకు వచ్చావని తోట మల్లేసును ప్రశ్నించారు. ఈనేపథ్యంలో వారి మధ్య వివాదం ఏర్పడి తోట మల్లేసు వైపు ఐదుగురు, పూతి దానమ్మ వైపు నలుగురు వ్యక్తులు చేరి ఒకరినొకరు తోసుకోవడంతో మల్లేసు కింద పడి పోయాడు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి కోటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ దర్యాప్తుచేస్తున్నారు. మల్లేసును కుటుంబ సభ్యులు కోటబొమ్మాళి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి జాయిన్ చేశారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. 17న రిమ్స్ నుంచి విశాఖ కేజీహెచ్‌కి మల్లేసును మెరుగైన చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనను టీడీపీ నాయకులపైకి తోసి బురద జల్లేందుకు వైసీపీ నేతలు ప్రయత్నించారు. అయితే డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఈ సంఘటనపై విచారణ చేపట్టి ఒకే కులానికి చెందిన రెండు వర్గాల వారు, బంధువులని, ఒకరికొకరు తోసుకోవడం వల్ల ఘటన జరిగింది తప్ప ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని నిర్ధారించి ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇద్దరు ఒడిశా వాసులకు గాయాలు

జలుమూరు (సారవకోట): మండలంలోని కరిడింగి వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు నరసన్నపేట నుంచి ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై పాతపట్నం వైపు వెళ్తున్నారు. కరిడింగి వద్ద ఎదురుగా కుక్కరావడంతో తప్పించపోయి వాహనం అదుపు తప్పి రోడ్డుమీద పడిపోయింది. దీంతో వాహనంపై ప్రయాణిస్తున్న ఒడిశాలోని రాణిపేటకు చెందిన కె.యోగీశ్వరరావు, ఎ.కాంతారావులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్సచేసి పర్లాకిమిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సారవకోట పోలీసులు తెలిపారు.

కంకర తరలిస్తున్న మూడు లారీలు సీజ్

పొందూరు: పొందూరు రెవెన్యూ పరిధి పైడికొండ 42 సర్వేనంబర్‌లో కంకర అక్రమంగా తవ్వి తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారుల కథనం మేరకు..మండలంలోని బొడ్డేపల్లి వద్ద జరుగుతున్న ట్రాక్ పనులకోసం కంకర మట్టి తవ్వకంకోసం సంబంధిత కాంట్రాక్టర్ తహసీల్దార్‌కు అనుమతులకోసం దరఖాస్తుచేసుకున్నారు.అయితే అనుమతులు మంజూరు చేయలేదు. కేవలం దరఖాస్తు అందినట్లు రిసీప్ట్ ఇచ్చారు. దీనినే అనుమతులుగా చూపుతూ కంకరమట్టిని అక్రమంగా 10 రోజులుగా భారీగా తరలిస్తున్నారు. కొద్దిరోజుల కిందట హెచ్చరించినా ఆపలేదు.ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దార్ కిరణ్‌పాల్‌కు ఫిర్యాదురావడంతో ఆర్ఐ, వీఆర్వో ఇద్దరు కానిస్టేబుళ్లు దాడిచేసి మూడు టిప్పర్‌లారీలను సీజ్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అయితే పైడికొండ వద్ద భారీగా లోతుగా తవ్వడంతో వర్షాకాలంలో పక్కన ఉన్న రైతులు ఎటువంటి ప్రమాదాలు జరుగుతాయోనని భయాందోళన చెందుతున్నారు.

నాలుగు ద్విచక్ర వాహనాలు...

ఆమదాలవలస: మునిసిపాలిటీ పరిధిలోని 21వ వార్డు కుద్దిరాంలో నాలుగు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం తెల్లవారుజామునపోలీస్‌సిబ్బందితో కలిసి కుద్దిరాంలో పోలీస్ కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా గ్రామంలో ఉన్న పలు ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటి పత్రాలను పరిశీలించారు. నాలుగు బైక్‌లకు ఎటువంటి పత్రాలు లేనట్లు గుర్తించారు. దీంతో వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సందడి

● కంచిలి, కవిటి, గార, నరసన్నపేటలో ఆత్మీయ సమ్మేళనాలు ● ఆనాటి ఉపాధ్యాయులకు సన్మానం

(కంచిలి/కవిటి/నరసన్నపేట/గార)

కంచిలిలో జడ్పీ పాఠశాల ఆవరణలో 2001-02, కవిటిలో ప్రభుత్వోన్నత పాఠశాలలో 2006-07, గార జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-2000 మధ్య, నరసన్నపేటలో పోలాకి మండలంలోని ప్రియాగ్రహారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1988-89లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఆనాటి మధురజ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. వివిధ స్థాయిలో ఉన్న వారంతా తమ బ్యాచ్‌లో ఆర్థికంగా వెనుకబడిన వారిపిల్లలకు విద్యాభ్యాసం కోసం సాయం చేసేందుకు ముందుకువచ్చారు.


నరసన్నపేట: అప్పటి గురువులతో ప్రియాగ్రహారం 1988-89 బ్యాచ్ విద్యార్థులు


కవిటి: ఉన్నతపాఠశాల ఆవరణలో అప్పటి గురువులతో 2006-07 పూర్వవిద్యార్థులు


గార: అప్పటి గురువును సత్కరిస్తున్న విద్యార్థులు


కంచిలి: జడ్పీ పాఠశాల ఆవరణలో 2001-02 పూర్వవిద్యార్థులు


ఎచ్చెర్ల :అరిణాం అక్కివలసలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు


సరుబుజ్జిలి: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య సేవలు అనుసరణీయం

ఆమదాలవలస:కమ్యూనిస్టుఉద్యమ నిర్మాత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు అనుసరణీయమని ప్రజా ఉద్యమనేత బొడ్డేపల్లి మోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఆమదాలవలస పూజారి పేటలో సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పూర్వపు జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి కనకలక్ష్మి, భవననిర్మాణ కార్మికులు టి.రాజారావు, తిరుపతిరావు, కె.రమ, కె.కమల పాల్గొన్నారు.

● **ఎచ్చెర్ల:**అరిణాం అక్కివలసలోని నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో, చిలకపాలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చి త్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సీపీఎం నేతలు తోనంగి నందోడు, కోరాడ అప్పన్న, వివిధ సంఘాల నేతలు లింగాల రామప్పడు, రమణ, ఎచ్చెర్ల రాజు పాల్గొన్నారు.

జింకిభద్రలో శ్రమదానం


బావిలోని మట్టిని తొలగిస్తున్న యువకులు

సోంపేట: జింకిభద్రలోని కుమ్మరినుయ్య బావిలో వివకేనంద యువజనసంఘ సభ్యులు ఆదివారం శ్రమదానంచేశారు.బావిలోమట్టి పేరుకుపోవడంతో తాగునీటికి గ్రామస్థులు అవస్థలుపడుతున్నారు.దీంతోసంఘ సభ్యులు మట్టితొలగించి గ్రామస్థుల నీటికష్టాలు తీర్చారు.

41 మంది రక్తదానం

అరసవల్లి:స్థానిక విజయశ్రీ బ్లడ్ బ్యాంకులో 41 మంది రక్తదానంచేశారు. ఆదివారం జూనియర్ఎన్టీఆర్ జన్మదినం పురస్కరించుకుని జిల్లా ఎన్టీఆర్ ఎమ్ఎస్ఎస్ సేవా సంఘం సభ్యులు మాదారపు డేవిడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ యువత సేవా కార్యక్రమాలను నిర్వహించడంపై అభినందించారు.అనంతరం మాదారపు డేవిడ్‌ను సత్కరించారు. రక్తదాతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, సురేంద్ర, సురేష్, ప్రసాద్, మోహన్, భాస్కర్, మహేష్, దుర్గా, రాజు, వెంకీ, భాస్కర్, జనార్దన్, రామ్‌కుమార్, వాసు పాల్గొన్నారు.

108 పిండి వంటలతో నైవేద్యం



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి పురస్కరించుకుని మహిళలు అమ్మవారికి 108 రకాల పిండి వంటలు తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ వేద పండితులు రావి జయకృష్ణ పూజలు నిర్వహించారు.

వేణుగోపాల స్వామికి క్షీరాభిషేకం

గార:శ్వేతగిరిపై వెలసిన వేణుగోపాల స్వామికి వైశాఖ శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ సుగ్గు మధు రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనృసింహదేవి దంపతులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎండలతో ఉక్కిరిబిక్కిరి

సరుబుజ్జిలి:మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం ఎనిమిది సాయంత్రం నాలుగు గంటల వరకు రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.


నిర్మానుష్యంగా మారిన మతలబుపేట గ్రామం

కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

● శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి:జూన్ నాలుగోతేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ సూచించారు. ఆదివారం శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అధ్యక్షతన ఆత్మీయసమావేశం నిర్వహించారు. అలాగే మీట్ ద ప్రెస్ కార్యక్రమం ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి కోసం పనిచేసిన పార్టీ శ్రేణులకు శంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మ గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ ఇచ్చినా సరే నూరుశాతం వారి విజయానికి మనస్ఫూర్తిగా కృషి చేసేవాడినన్నారు. గెలిచినా, లేకున్నా ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజలకు సేవచేస్తూనే ఉంటానన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, పాండ్రంకి శంకర్, రెడ్డి గిరిజా శంకర్, చల్లా వాసు, మైలపల్లి నర్సింహమూర్తి, కవ్వాడి సుశీల, విభూది సూరిబాబు, కొమ్మనాపల్లి వెంకటరామరాజు పాల్గొన్నారు.

పుస్తెలతాడు దొంగతనం

బూర్జ: మండలంలోని ఏబీసీపేటకు చెందిన గంగాడ రాజమ్మ ఇంట్లో శనివారం రాత్రి నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మెడలోని మూడు తులాల బంగారం పుస్తెలతాడు దొంగిలించారని బూర్జ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. ఆదివారం క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టింది.

వీహెచ్‌పీ క్యాలెండర్ ఆవిష్కరణ

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస వేంకటేశ్వరాలయంలో విశ్వహిందూ పరిషత్ వార్షిక క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ సన్నిధిలో సరుబుజ్జిలి మండల ప్రఖండ వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షులు చింతాడ వరహాకృష్ణ, ఆమదాలవలస అధ్యక్షులు పి.మన్మధరావు ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు కె.శ్రీనివారావు, కె.అప్పలనాయుడు, కేవీరమణమూర్తి, ఎం.రమణ, ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

చిలకపాలెంలో అసిరితల్లి ఉత్సవాలు

రణస్థలం: చిలకపాలెంలోని అసిరితల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి.ఈమేరకు విజయనగరం ఎంపీ కూటమి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు ఆదివారంఅమ్మవారిని దర్శించుకున్నారు.ఈసందర్భంగా అమ్మ వారి ఘటాలకు మొక్కారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలక రాము పాల్గొన్నారు.

● **అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని విజ యనగరం టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. చంద్రబాబు, లోకేష్, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్ కూడా ఆదిత్యుని దర్శించుకున్నారు.


రణస్థలం:అసిరితల్లి అమ్మవారి ఘటాలకు మొక్కుతున్న కలిశెట్టి

అప్రమత్తతతోనే ఎయిడ్స్ నివారణ

ఇచ్ఛాపురం: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి తెలిపారు. ఇచ్ఛాపురంలోని సీహెచ్‌సీ నుంచి ఐసీటీసీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ బమ్మిడి రాజశేఖర్, ఆసుపత్రి సిబ్బంది రవికుమార్, గున్ను, రవికుమార్ పాల్గొన్నారు.

● **పొందూరు:** ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపకుండా, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపిక్రమం తప్పకుండా మందులువాడితే ఎటువంటి ప్రమాదం ఉండదని పొందూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ఆర్. రామ్‌దాస్ తెలిపారు. ఆదివారం రాత్రి పొందూరులో అంతర్జాతీయ ఎయి డ్స్ దీప స్మృత్యంజలి దినం (ఐఏసీఎండీ) పురస్కరించుకుని ఐసీటీసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రతిఏటా మే మూడోఆదివారం ఎయిడ్స్, హెచ్ఐవీ బారినపడి మృతిచెందిన వారి ఆత్మశాంతికి నివాళిగా ప్రపంచ వ్యాప్తంగా 115 దేశాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా 1983లో నిర్వహించారని రామ్‌దాస్ తెలిపారు. ర్యాలీలో పొందూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్, ఐసీటీసీ కౌన్సిలర్ కె. నాగావళి, ల్యాబ్‌టెక్నీషియన్ ఎం. విజయలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


పొందూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది


ఇచ్ఛాపురం బస్టాండ్ జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం